క్లుప్తంగా

బీమా ప్రీమియం చెల్లించండి



'పొలం పిలుస్తోంది'లో పాల్గొన్న ఏడీఏ సత్యనారాయణ

ముదిగుబ్బ: రబీలో టమాట, మామిడి, వేరుశనగ పంటలు సాగు చేసుకున్న రైతులు పంటల బీమా ప్రీమియం చెల్లించాలని ఏడీఏ సత్యనారాయణ రైతులకు సూచించారు. మంగళవారం చెంచుగారిపల్లి తండాలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కంది పంటను పరిశీలించి పంట చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఓ లక్ష్మీనరసింహులు, సిబ్బంది పాల్గొన్నారు.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై నేడు శిక్షణ

తనకల్లు: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రెడ్డెప్ప మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి బ్యాచ్ అధికారులకు ఈ నెల 11, 12 తేదీల్లో, రెండో బ్యాచ్‌కు 16, 17 తేదీల్లో శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే శిక్షణకు సర్పంచులు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది హాజరు కావాల్సి ఉంటుందని తెలిపారు.

పంట భూముల సంరక్షణే లక్ష్యం



రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రామగిరి: పంట భూముల రక్షణే టింబక్ట్ కలెక్టివ్ లక్ష్యమని ఆ సంస్థ రాయలసీమ వాటర్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ రవి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో సంస్థ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంతకు ముందు జేసీబీ వాహనంతో కాలువలు పూడికతీత పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రొద్దం, రామగిరి, చెన్నేకొత్తపల్లి మండలాల్లోని 16 గ్రామాల్లో ఈ ప్రాజెక్ట్ పని జరుగుతోందన్నారు. ఈ పనులతో గ్రామాల్లో 220 ఎకరాల సాగులోకి రావడమేకాక ఆయకట్టు చివర ఉన్న పొలాలకు నీరు చేరుతోందన్నారు. అనంతరం సేంద్రియ సాగుపై అవగాహన కల్పించారు. సంస్థ సిబ్బంది ప్రవీణ్‌కుమార్, కాంచన, రవీంద్రప్రసాద్, ముత్యాలయ్య, నారాయణస్వామి, శెట్టిపల్లెప్ప, ఆదినారాయణ పాల్గొన్నారు.

సూర్యఘర్ పథకంపై అవగాహన

పుట్టపర్తి టౌన్: పుట్టపర్తి పట్టణంలో ఉన్న సాయి ఆరామంలో ఈ నెల 12వ గురువారం ఉదయం 10 గంటలకు సూర్యఘర్ పథకంపై వినియోగదారులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు విద్యుత్‌శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుకు బ్యాంక్ అధికారులు, స్వయం సహాయక సంఘాలు, పంచాయితీ అధికారులు, నెడ్‌క్యాప్ అధికారులు పాల్గొంటారన్నారు. ఈ సదస్సులో సూర్యఘర్ పథకం ప్రయోజనాలు, సబ్సిడీని వివరించనున్నట్లు పేర్కొన్నారు.

పోలీసుల 'పల్లెనిద్ర'

బత్తలపల్లి: వెంకటగారిపల్లిలో సోమవారం రాత్రి ఎస్‌ఐ సోమశేఖర్ పల్లెనిద్ర కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ధర్మవరం రూరల్ సీఐ ప్రభాకర్, ఎస్‌ఐ సోమశేఖర్ గ్రామస్తులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అందరూ ఐకమత్యంగా కలిసి మెలిసి ఉండాలని సూచించారు.

సేంద్రియ ఎరువులపై దృష్టి సారించండి



రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ సనావుల్లా

నల్లచెరువు: రైతులు రసాయన ఎరువుల వాడకం తగ్గించి, సేంద్రియ ఎరువులపై దృష్టి సారించాలని ఏడీఏ సనావుల్లా సూచించారు. మండలంలోని చెవిటివారిల్లి, మద్దిమడుగు గ్రామాల్లో మంగళవారం ఏఓ భారతి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మొక్కజొన్న పంట సాగు చేసే విధానం, పంటకు ఆశించే కత్తెర పురుగు నివారణకు తీసుకోవాల్సిన చర్యలను రైతులకు వివరించారు. రబీలో సాగు చేసే పంటలకు తప్పనిసరిగా బీమా చేసుకోవాలన్నారు. వేరుశనగ పంటకు ఎకరాకు రూ.480, వరి పంటకు రూ.630, టమాటకు రూ.1,600 ప్రీమియం చెల్లించాలన్నారు. అనంతరం సేంద్రియ వ్యవసాయం, విత్తన శుద్ధితో పాటూ వ్యవసాయ శాఖ పథకాలు, నూతన వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు.

తుప్పే.. ఎవరిదీ తప్పే?

- సీజ్ చేసిన వాహనాలతో నిండిన పోలీసుస్టేషన్లు
- తీసుకెళ్లేందుకు ముందుకురాని యజమానులు
- వేలం వేస్తే ప్రభుత్వానికి ఆదాయం



ఓడీ చెరువు పోలీస్ స్టేషన్‌లో పోలీసులు సీజ్ చేసిన వాహనాలు

నియోజకవర్గం	: పుట్టపర్తి
పోలీసుస్టేషన్ల సంఖ్య	: 7
సీజ్ చేసిన వాహనాల సంఖ్య	: 200 కు పైగా

పుట్టపర్తి టౌన్: రోడ్డు ప్రమాదాలు, ఇసుక, గంజాయి, రేషన్ బియ్యం అక్రమ రవాణా, దొంగతనాలు తదితర కేసుల్లో పోలీసులు సీజ్ చేసిన వాహనాలు పోలీసుస్టేషన్లలోనే తుప్పుబట్టిపోతున్నాయి. పుట్టపర్తి నియోజకవర్గంలో ఏడు పోలీస్‌స్టేషన్లు ఉన్నాయి. వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలు 200కు పైగా స్టేషన్లలోనే దర్శనమిస్తున్నాయి. ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ తుప్పుపడుతున్నాయి. ఏళ్ల తరబడి ఉన్న చాలా వాహనాలు ఎందుకూ పనికిరాకుండా పోతున్నాయి. అందులో ఎక్కువ భాగం ద్విచక్ర వాహనాలు కాగా.. కార్లు, ఆటోలు, లారీలు, జీపులు కూడా ఉన్నాయి.

పరిష్కారం కాని కేసుల్లో...

సీజ్ చేసిన వాహనాల్లో కొన్నింటిని మాత్రం వాటి యజమానులు విడిపించుకుపోతుంటారు. అయితే చాలా వరకూ ఏళ్ల తరబడి కేసులు పరిష్కారం కాని కారణంగా పోలీస్‌స్టేషన్లలోనే వాహనాలు ఉండిపోతున్నాయి. దీంతో రోడ్డుపై నడపడానికి వీలుకాని విధంగా మారుతున్నాయి. కొన్ని సందర్భాల్లో కోర్టు ఆదేశాల తరువాత కూడా వాహనాలు విడిపించుకోవడానికి యజమానులు ముందుకు రావడం లేదు. ప్రమాదాలకు గురైన వాహనాలకు సంబంధించిన కేసుల్లో ఇలాంటివి ఎక్కువగా జరుగుతున్నాయి. తమ బంధువులను కోల్పోయిన వ్యక్తులు వాహనాలు తిరిగి తీసుకెళ్లడానికి ఇష్టపడక పోవడంతో అవి పోలీసుస్టేషన్లలోనే మగ్గుతున్నాయి. ప్రమాదవశాత్తో లేదా ఇతర కారణాలతో సీజ్ చేసి పోలీసుస్టేషన్‌కు తీసుకొచ్చిన వాహనాలకు రెవెన్యూ అధికారుల సమక్షంలో పంచనామ చేయాలి. అలా చేసిన వాహనాలు ఆరు నెలలకు ఒకసారి బహిరంగ వేలం ద్వారా విక్రయిస్తే ప్రభుత్వానికి కొంత ఆదాయం వస్తుంది. కానీ ఆ దిశగా పోలీస్‌శాఖ చర్యలు చేపట్టకపోవడంతో వందలాది వాహనాలు స్టేషన్‌లో తుప్పుపట్టి ఎందుకూ పనికి రాకుండా పోతున్నాయి.



పుట్టపర్తి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో తుప్పు పట్టిన వాహనాలు



పుట్టపర్తి అర్బన్ పోలీస్ స్టేషన్‌లో ఇలా..

కోర్టు ఆదేశాలే ముఖ్యం



వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను సీజ్ చేసి పోలీసుస్టేషన్లకు తరలిస్తుంటాం. వాహనంపై కోర్టులో కేసులు నడుస్తుంటాయి. సంవత్సరాలు గడిచే అవకాశం కూడా ఉంది. కోర్టులో ఉంచుకొనే దానికి స్థలం, సెక్యూరిటీ సమస్యలతో తిరిగి మాకు అప్పగిస్తారు. వాహనాల సెక్యూరిటీ బాధ్యత పోలీసులపై ఉంటుంది. కోర్టు ఎప్పుడు ఆదేశాలు జారీచేస్తే అప్పుడు వాహనం ఎలా ఉన్నా కోర్టుకు చూపించేవిధంగా చూస్తాం. కొన్ని వాహనాలకు రికార్డులు సరిగా లేని వాహనాలు తీసుకొనేందుకు యజమానులు ముందుకురారు. వాటిలో ఏ వస్తువు పోకుండా జాగ్రత్తగా ఉంచుతాం.

– విజయకుమార్, డీఎస్పీ

ఘనంగా మానవ హక్కుల దినోత్సవం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం మానవ హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ 1948 డిసెంబర్ 10న మానవ హక్కుల దినోత్సవంగా ప్రకటించారన్నారు. మానవ హక్కులపై అవగాహన పెంచాలనే ఉద్దేశంతోనే ప్రపంచ వ్యాప్తంగా ఏటా ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరూ రాజ్యాంగంలోని కల్పించిన హక్కులపై అవగాహన పెంచుకుని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కళాశాల అధ్యాపకులు గోపాల్‌నాయక్, చిట్టెమ్మ, పావని, కిరణ్ కుమార్, భువనేశ్వరి, పుష్పావతి, మీనా, ఆనంద్, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి

మానవ హక్కులపై అవగాహన పెంచుకోవాలి

విద్యార్థి దశ నుంచే మానవ హక్కులపై అవగాహన పెంచుకోవాలని వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. పట్టణంలోని సాయికృప జూనియర్ కళాశాలలో మంగళవారం ఇంటర్‌నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే మానవ హక్కులు, బాధ్యతల గురించి తెలుసుకోవాలన్నారు. అనంతరం ఐహెచ్‌ఆర్‌పీసీ ఆర్గనైజేషన్‌లో కొత్తగా చేరిన వారికి సర్టిఫికెట్లు, ఐడీ కార్డులను సీఐ అందించారు. ఐహెచ్‌ఆర్‌పీసీ నేషనల్ లీగల్ సెల్ ప్రెసిడెంట్ సుమలత, జిల్లా అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, కళాశాల కరస్పాండెంట్ భగవంత్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోండి

గాండ్లపెంట: ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను గ్రామీణులు సద్వినియోగం చేసుకోవాలని కదిరి ఆర్డీఓ వీఎస్ శర్మ సూచించారు. మంగళవారం మండలంలోని సోమయాజులపల్లిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ భూ సమస్యలు, ఇతర సమస్యలను గ్రామసభలో తెలిపి పరిష్కారం పొందాలని సూచించారు. గ్రామ సభలో పట్టాదారు పాసుపుస్తకాల కోసం 3 వినతులు, ప్రభుత్వ భూమికి సాగు పట్టా ఇవ్వాలని ఒక వినతి, పింఛన్లు మంజూరు చేయాలని నాలుగు వినతి పత్రాలు అందించారని తహసీల్దార్ బాబురావు తెలిపారు. వచ్చిన వినతులను ఆయా శాఖల వారీగా పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. సదస్సులో తహసీల్దార్‌తో పాటు సీనియర్ సహాయకుడు జాఫర్, వీఆర్వో అమీనుల్లా, ఎస్‌ఐ ఇషాక్‌బాషా, రాజేంద్ర పాల్గొన్నారు.



సోమయాజులపల్లిలో మాట్లాడుతున్న కదిరి ఆర్డీఓ వీఎస్ శర్మ

తాడిమర్రి: భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ బాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. పెద్దకోట్లలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూముల సరిహద్దు వివాదాలు, రస్తా వివాదాలు, వన్‌బీ, అడంగల్, ఇళ్ల పట్టాలు తదితర సమస్యల పరిష్కారం కోసం గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రస్తా సమస్యలపై 4, సరిహద్దు సమస్యలపై మూడు, ఇళ్ల పట్టాల కోసం ఐదు అర్జీలు ఇచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు.

రైతులపై భాష్పవాయువు ప్రయోగం దారుణం

ధర్మవరం: ఢిల్లీ సరిహద్దుల్లో పంటలకు మద్దతు ధర కోసం శాంతియుతంగా ర్యాలీ చేస్తుంటే కేంద్ర ప్రభుత్వం రైతులపై భాష్పవాయువులు ప్రయోగించడం దారుణమని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు పేర్కొన్నారు. పట్టణంలోని ధర్మవరం ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం సీపీఐ నియోజకవర్గ ముఖ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని, స్మార్ట్ మీటర్ల బిగింపు మానుకోవాలన్నారు. సీపీఐ పట్టణ కార్యదర్శి పూలశెట్టి రవికుమార్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కాటమయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కుళ్లాయప్ప, చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వెంకటనారాయణ, సభ్యులు వెంకటస్వామి, సమాఖ్య జిల్లా అధ్యక్షుడు సకల రాజా, పట్టణ సహాయ కార్యదర్శి రమణ, బత్తలపల్లి మండల కార్యదర్శి బండల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మధు

'రియల్' వ్యాపారులపై చర్యలు తీసుకుంటాం

కనగానపల్లి: రహదారుల పక్కన కల్వర్టులు, కాలువలను పూడ్చేస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులపై చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ జీ.వీ. ప్రసాద్ తెలిపారు. మంగళవారం సాక్షిలో కల్వర్టులను పూడ్చేస్తున్న రియల్ వ్యాపారులు శీర్షికన కథనం వెలువడింది. దీనిపై స్థానిక రెవెన్యూ అధికారులు స్పందించి బుధవారం పూడిక పనులు ఆపు చేయించారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ జీ.వీ. ప్రసాద్ దీనిపై స్థానిక రెవెన్యూ సిబ్బందితో చర్చించారు. అనంతరం స్థానిక రైతులు నరసింహులు, గోవిందురెడ్డి, వెంకటనారాయణ, రామకృష్ణ సర్పంచ్ నారాయణతో కలసి అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఇప్పటికే రియల్ వ్యాపారులను హెచ్చరించి పనులు ఆపేశామని, భూ ఆక్రమణలు, అక్రమంగా మట్టి తరలింపుపై కూడా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ రైతులకు హామీఇచ్చారు. సీఎస్‌డీటీ కవిత, ఆర్‌ఐ సరళ, వీఆర్వో చెన్నకేశవులు పాల్గొన్నారు.



రెవెన్యూ సదస్సులో తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న ముక్తాపురం రైతులు

భూ సమస్యల పరిష్కారానికి కృషి



డి.చెర్లోపల్లిలో మాట్లాడుతున్న తహసీల్దార్ స్వర్ణలత

బత్తలపల్లి: గ్రామాల్లో భూ సమస్యలపై అర్జీలు ఇస్తే వాటికి పరిష్కారం చూపుతామని తహసీల్దార్ స్వర్ణలత పేర్కొన్నారు. మంగళవారం డి.చెర్లోపల్లిలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాలలో నెలకొన్న రెవెన్యూ సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందన్నారు. మండల సర్వేయర్ జోసెఫ్, సూనియర్ అసిస్టెంట్ హరికృష్ణ, వీఆర్ఓ కుళ్లాయప్ప, గ్రామ సర్వేయర్ లావణ్య పాల్గొన్నారు.

తలుపుల: గ్రామీణ ప్రాంతాల్లోని భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు కదిరి ఆర్డీఓ వెకట సన్యాసి శర్మ తెలిపారు. మంగళవారం పెద్దన్నవారిపల్లిలో తహసీల్దార్ రెడ్డిశేఖర్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ రైతులు తమ భూములకు సంబంధించి ఏవైనా సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు.. తమ దృష్టికి వచ్చిన ప్రతి అంశాన్నీ పరిశీలించి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామానాయక్, ఆర్‌ఐ శ్రీనివాసులు, వీఆర్‌ఓలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఓడీచెరువు : భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ అభిషేక్ స్పష్టం చేశారు. తుమ్మలకుంట్లపల్లి సచివాలయంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు జాయింట్ కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తుమ్మలకుంటపల్లి సదస్సులో 152 ఫిర్యాదులు, వీరోఓబునపల్లిలో 31 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ సువర్ణ, తహసీల్దార్ అనంతాచారి, ఎంపీడీఓ రాబర్ట్ విల్సన్ తదితరులు పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లి: భూ సమస్యలను పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సురేష్‌కుమార్ పేర్కొన్నారు. మేడాపురం గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు భూ సమస్యలపై అధికారులకు అర్జీలు సమర్పించారు. వాటిని విచారించి త్వరగా పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు. రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నేడు పులేటిపల్లిలో రెవెన్యూ సదస్సు

పులేటిపల్లిలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించన్నుట్లు తహసీల్దార్ సురేష్‌కుమార్ తెలిపారు. రెవెన్యూ గ్రామ పరిధిలోని రైతులు భూ సమస్యలపై వినతిపత్రాల ద్వారా తెలియజేయాలన్నారు.

మండలాభివృద్ధికి సహకరించండి

రామగిరి: మండలాభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సహకరించాలని ఎంపీపీ మీనుగ నాగమ్మ కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా అధికారులు తమ శాఖల ప్రగతిని చదివి వినిపించారు. ఎంపీపీ మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే మండలం వెనుక బడి ఉందన్నారు. గ్రామాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలనుకుంటే అధికారులు, టీడీపీ నాయకులు సహకరించడం లేదన్నారు. సర్వసభ్య సమావేశాలు ఎన్ని జరిగినా అధికారుల తీరు మారడం లేదన్నారు. అభివృద్ధికి సహకరించకుంటే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఎంపీడీఓ ఆజాద్, మండల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఆజాద్

21న టెండర్లు

కదిరి అర్బన్: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో మెయిన్ రోడ్డు, బస్టాండ్‌లో ఖాళీగా ఉన్న స్టాళ్లకు ఈ నెల 21 జిల్లా కేంద్రంలోని రీజినల్ కార్యాలయంలో సీల్డ్ టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు డీఎం మైనోద్దీన్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఫాస్ట్ ఫుడ్, వాహనాల పార్కింగ్, స్వీట్స్ షాపులు, హోటల్, జనరల్ స్టోర్ నిర్వహించుకునేందుకు ఆసక్తి గల వ్యాపారులు ఈ-టెండర్లు వేసుకోవచ్చన్నారు. టెండర్ ఫారాలు స్థానిక ఆర్టీసీ డిపోలో ఈ నెల 20 వరకూ ఇస్తామన్నారు. టెండర్‌ఫారానికి రూ. 885 చెల్లించాలని ఆయన సూచించారు.

కొనసాగిన మున్సిపల్ కార్మికుల దీక్ష

కదిరి టౌన్: మున్సిపల్ కార్యాలయంలో ఇంజినీరింగ్ సెక్షన్‌లో పనిచేసే అవుట్ సోర్సింగ్ కార్మికులకు వేతనాలు పెంచాలని మున్సిపల్ కార్యాలయం ఎదుట మంగళవారం రెండో రోజూ రిలే నిరహార దీక్ష చేపట్టారు. 15 సంవత్సరాల సర్వీస్ కలిగిన మున్సిపాలిటీ ఇంజినీరింగ్ వర్కర్స్‌ను క్రమబద్ధీకరణ చేయాలని, కనీస పనికి కనీస వేతనం రూ. 29,500 అందజేయాలన్నారు. కార్మికులు చనిపోతే.. వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని, కార్మికుల కుటుంబాల్లో ఎవరైనా చనిపోతే రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు గంగాద్రి, వెంకటస్వామి, అల్తాఫ్, బాబునాయక్, రామ్మోహన్, రంగనాథ్, సరోజమ్మ, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.



రిలే నిరాహార దీక్ష చేస్తున్న కార్మికులు

పన్ను బకాయిలపై ఆరా

ధర్మవరం: పట్టణంలోని గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ శాఖ కార్యదర్శి పి.రమ తనిఖీ చేశారు. మంగళవారం గ్రంథాలయంలోని పలు రికార్డులను పరిశీలించారు. గ్రంథాలయ పన్ను బకాయిలపై అడిగి తెలుసుకున్నారు. గ్రంథాలయాధికారిణి అంజలి సౌభాగ్యవతి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరు తులాల బంగారం చోరీ

కదిరి టౌన్: జొన్నా వీధిలో నివాసం ఉన్న రామ సుభద్ర తన ఇంట్లో ఆరు తులాలు బంగారు ఆభరణాలు చోరీ అయినట్లు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేసింది. వివరాలు.. ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రామ సుభద్ర నుంచి మున్సిపాలిటీలో స్వీపర్‌గా పని చేసే శారద గత బుధవారం పెళ్లి నిమిత్తం బంగారు దండ తీసుకెళ్లింది. పెళ్లి అనంతరం శారద తిరిగి దండను రామసుభద్రకు అందజేసింది. ఆమె శారద ఎదుటే బీరువాలో బంగారు దండను భద్రపరిచింది. అయితే మంగళవారం బీరువా తెరచి చూడగా అందులో నాలుగు బంగారు గాజులు,ఒక బంగారు చైను కనిపించకపోవడంతో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. రామ సుభద్రకు తన ఇంటి దగ్గర ఉన్న శారదపైన అనుమానం వ్యక్తం చేస్తూ.. మరెవరైనా దొంగలించి ఉంటారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి , డాగ్ స్క్వాడ్‌ను రప్పించి దర్యాప్తు చేపట్టినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపారు.

యథేచ్ఛగా మానవ హక్కుల ఉల్లంఘన



మానవహారం ఏర్పాటు చేసిన దృశ్యం

కదిరి అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో మంగళవారం ఎస్ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ నేటి సమాజంలో మానవ హక్కుల ఉల్లంఘన యథేచ్ఛగా జరుగుతోందన్నారు. కర్నూలు జిల్లా నందికొట్కూరులో ఇంటర్ చదువుతున్న లహరి అనే బాలికపై పెట్రోల్ పోసి దారుణంగా హతమార్చారన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కళాశాల విద్యార్థులు మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబ్జాన్, నాయకులు అఖిల్, విజయ్, మహిళా సంఘం అధ్యక్షురాలు లక్ష్మీదేవి, సుజాత పాల్గొన్నారు.

సౌత్ జోన్ ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

పుట్టపర్తి అర్బన్: త్వరలో జరగనున్న ఫుట్‌బాల్ సౌత్ జోన్ పోటీలకు ఎస్కే యూనివర్సిటీ తరఫున ఎంపికైన జట్టులో పుట్టపర్తి మండలం జగరాజుపల్లి మంగళకర కళాశాల విద్యార్థులకు స్థానం లభించినట్లు కళాశాల యాజమాన్యం పేర్కొంది. కళాశాలలో బీకాం, బీబీఏ రెండో సంవత్సరంలో చదువుతున్న విద్యార్థులు బాబు, యూసఫ్, చిన్నా, జగదీష్ ,అరవింద్ లు ఈనెల 21 నుంచి 28 వరకూ కేరళలోని కాలికట్ యూనివర్సిటీలో జరిగే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ ఫుట్‌బాల్ పోటీలకు ఎస్కే యూనివర్సిటీ తరఫున పాల్గొంటున్నట్లు చెప్పారు. మంగళవారం ఆ కళాశాల మేనేజింగ్ ట్రస్టీ సురేష్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ ఆర్యా ప్రకాష్, ఏఓ జయచంద్రారెడ్డి, ప్రిన్సిపాల్ రమేష్‌బాబు, పీడీ శ్రీనివాసులు అధ్యాపక బృందం విద్యార్థులను అభినందించారు.

14న జాతీయ లోక్ అదాలత్



మాట్లాడుతున్న జడ్జి గీతావాణి

ధర్మవరం అర్బన్: ఈనెల 14న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవా అధికార సంస్థ చైర్‌పర్సన్ గీతావాణి తెలిపారు. రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ ఆదేశానుసారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామన్నారు. కక్షిదారులు, బ్యాంకు వారు రాజీ కాదగ్గ కేసులు లోక్ అదాలత్‌లో పరిష్కరించుకుని తమ డబ్బు, సమయాన్ని ఆదా చేసుకోవాలని సూచించారు.

హాల్ టికెట్ల విడుదల

పుట్టపర్తి టౌన్: వదాన్య సొసైటీ ఆధ్వర్యంలో కొత్తచెరువు కేంద్రంగా ఈనెల 29న డీఎస్సీ అభ్యర్థులకు ప్రత్యేక పరీక్ష నిర్వహిస్తున్నట్లు వదాన్య సొసైటీ చైర్మన్ అశోక్ పడిపాటి ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే పరీక్ష రాసేందుకు జిల్లా వ్యాప్తంగా 2110 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. అందరికీ హాల్‌టికెట్లు విడుదల చేశామన్నారు. www.vadaanya.org వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. పరీక్షలో ప్రతిభ కనబరచిన 50 మందికి నగదు బహుమతులు అందిస్తామన్నారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ

తలుపుల: అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వారిని ఉపేక్షించవద్దని కదిరి డీఎస్పీ శివనారాయణ స్వామి పోలీసులకు సూచించారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను డీఎస్పీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండలంలోని నేరాలు, ఫ్యాక్షన్ గ్రామాలు, గ్యాంబ్లింగ్ తదితర విషయాలపై ఎస్‌ఐ నరసింహుడుతో ఆరా తీశారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నేడు సమావేశం

కదిరి టౌన్: పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో 13న కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాపై చర్చించడానికి బుధవారం సమావేశం నిర్వహించనున్నట్లు కదిరి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యులందరూ సమావేశానికి హాజరు కావాలన్నారు.